వెరైటీ ప్రచారం



చిత్తూరు లోక్‌సభ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తరపున వినూత్నరీతిలో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. కొందరు యువకులు పసుపు టీ షర్టులు ధరించి.. పార్టీ జెండాలు చేతపట్టి యునిక్ సైకిళ్ల (ఒకే చక్రం)లో చిత్తూరు నగర వీధుల్లో ముందుకు సాగుతున్నారు. ఈ ప్రచారాన్ని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

- చిత్తూరు సిటీ



నగరిలో భారీ జన సందోహం నడుమ నామినేషన్ వేయడానికి వెళుతున్న టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్

తొలిరోజు 15 నామినేషన్లు

పార్లమెంటు స్థానానికి ఒకటి | ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 | కుప్పం, పూతలపట్టుల్లో నిల్

భారీ జనసందోహంతో నామినేషన్‌కు భానుప్రకాష్

నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ భారీ జన సందోహంతో తరలివచ్చి నామినేషన్ వేశారు. నామినేషన్ కార్యక్రమానికి తెలుగుతమ్ముళ్లు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. పదివేల మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారు. వినాయకస్వామి ఆలయం నుంచి ర్యాలీగా టవర్‌క్లాక్ మీదుగా తహసీల్దారు కార్యాలయానికి తరలివెళ్లారు. పార్టీ నేత ప్రతాప్‌రాజు ప్రతిపాదించగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీరెడ్డిలతో కలిసి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు.







నామినేషన్ దాఖలు చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు - గురజాల జగన్మోహన్ - భానుప్రకాష్



చల్లా రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు నడుమ అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. తొలిరోజైన గురువారం చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి 01, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం, పూతలపట్టు (ఎస్సీ) నియోజకవర్గాలకు బోణీ కాలేదు. నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే లోనికి అనుమతించారు. డీఎస్పీ హోదా కలిగిన అధికారి నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ సెలవు రోజు మినహా ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది.

- చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గానికి టీడీపీ తరపున దగ్గుమళ్ల ప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షన్మోహన్ నామినేషన్ స్వీకరించారు.
- పుంగనూరు స్థానానికి టీడీపీ తరపున చల్లా రామచంద్రారెడ్డి, చల్లా పూజారెడ్డి, కాంగ్రెస్ నుంచి జి.మురళీమోహన్, సోషియల్ డెమొక్రెటిక్ పార్టీ నుంచి ఖాన్దాది షేక్ అన్వర్ బాషా నామినేషన్ దాఖలు చేశారు.
- నగరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి జి.భానుప్రకాష్ నామినేషన్ వేశారు.

రాబోయే ఎన్నికలలో జనం వర్సెస్ జగన్

రాబోయే అసెంబ్లీ ఎన్నికలు జనం వర్సెస్ జగన్ అన్న రీతిలో జరగనున్నాయి. నామినేషన్ వేయడానికి ఇంత భారీ స్థాయిలో జనం తరలి వచ్చారంటే జగన్‌రెడ్డిపై ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తుంది. వైసీపీ లాంటి అరాచక, అక్రమ, అసమర్థత ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు. విసుగుపుట్టిన ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

- నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్

- గంగాధరనెల్లూరు(ఎస్సీ)కు టీడీపీ తరపున గాంధీ రత్నవేలు, స్వతంత్ర అభ్యర్థిగా ఉసురుపాటి పద్మనాభం నామినేషన్ దాఖలు చేశారు.
- చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి మూడు సెట్లు, టీడీపీ అభ్యర్థి జీసీ జగన్‌మోహన్ రెండుసెట్ల నామినేషన్ వేశారు.
- పలమనేరు నియోజకవర్గానికి వైసీపీ తరఫున ఎన్.వెంకటేగౌడ, ఎన్.పావని నామినేషన్ వేశారు.

పతి తరపున సతీమణి

- చంద్రబాబు తరపున నేడు భువనేశ్వరి నామినేషన్ దాఖలు



బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 18 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన తరపున నామినేషన్ వేసేందుకు సతీమణి నారా భువనేశ్వరి గురువారం కుప్పం చేరుకున్నారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలకు వచ్చారు. రాత్రి ఇక్కడే సొంత క్యారవాన్‌లో బస చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె రెండు రోజులపాటు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

అందర్నీ రమ్మని నా మాటగా చెప్పండి!

- కుప్పం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

కుప్పం, ఏప్రిల్ 18: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం కుప్పం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి తన మాటగా పిలవాలని కోరారు. వారి సమస్యలను ఎక్కడికక్కడ రాసుకోవాలని, వాటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. చంద్రబాబు మాటలు క్లుప్తంగా.. 'మన మంతా ఒక కుటుంబ సభ్యులం. ఇన్నాళ్లూ నేనుకానీ, నా కుటుంబ సభ్యులు కానీ కనీసం ప్రచారానికి రాకుండానే మీరు అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపిస్తూ వచ్చారు. దానికి పార్టీ శ్రేణులతోపాటు నియోజకవర్గ ప్రజలందరికీ నేను రుణపడి ఉన్నాను. ఇప్పుడు మొదటిసారిగా నా కుటుంబ సభ్యులు నా తరపున నామినేషన్ వేయను న్నారు. శుక్రవారం నా సతీమణి నారా భువనేశ్వరి వేసే నామినేషన్ కార్యక్రమం విజయవంతమయ్యేలా మీరందరూ సహకరించాలి. మీరే కాదు, నియోజకవర్గ ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. మీరు స్వయంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలవాలి. ప్రజలందరినీ స్వయంగా ఆహ్వానించాలి. ఏవైనా సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని రాసి రికార్డు చేసుకోవాలి. అందరి సమస్యలు మనం అధికారంలోకి వచ్చాక తప్పకుండా పరిష్కరిస్తాం. కచ్చితంగా అధికారంలోకి రాబోయేది మనమే. ఇందులో ఎటువంటి అనుమానం లేదు. మనం అత్యధిక మెజారిటీతో, అత్యధిక సీట్లతో గెలిచి తీరుతున్నాం. ముందు మీరు గ్రామాలకు కదిలి, ప్రజలతో మమేకం కావాలి. సూపర్ సిక్స్ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. 35ఏళ్లపాటు ఎంతగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానో, రాబోయే అయిదేళ్లలో అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తాను. ఈ విషయాన్ని జనంలోకి మీరు తీసుకు వెళ్లాలి. ఇక మనకు సమయం ఎంతో లేదు. దానికి ముందుగా నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలి. కుప్పంలో లక్ష ఓట్ల మెజారిటీకి ఇది నాందీవాక్యం కావాలి' అని చంద్రబాబు అన్నారు.



గేటును తోసుకుంటూ లోనికి వెలుతున్న కారు

వైసీపీ నిబంధనల ఉల్లంఘన

- కలెక్టరేట్ గేటు తోసుకుంటూ లోనికెళ్లిన పార్టీ శ్రేణులు
- అదుపు చేయలేక చేతులెత్తేసిన పోలీసులు

చిత్తూరు, ఏప్రిల్ 18: చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి నామినేషన్ దాఖలు ప్రక్రియలో ఆ పార్టీ శ్రేణులు నిబంధనలు ఉల్లంఘించాయి. గురువారం నామినేషన్ దాఖలు చేసేందుకు గంగినేని చెరువు నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రెండుగంటల పాటు సాగిన ఈ ర్యాలీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్దకు చేరుకుంది. లోపలికి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని ఎన్నికల సంఘం నిబంధన ఉన్నా వైసీపీ శ్రేణులు పట్టించుకోలేదు. విజయానందరెడ్డి, ఆయన సతీమణి, కుమారుడు కారులో వచ్చారు. గేటు వద్దనే కారు ఆపి వెళ్లాలని పోలీసులు చెప్పినప్పటికీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు వినిపించుకోకుండా తోసుకుంటూ లోనికి తీసుకెళ్లారు. చేసేది లేక పోలీసులు మిన్నకుండిపోయారు. కాగా, విజయానందరెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా చిత్తూరులోని వీధులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించాయి. ఎంఎస్ఆర్ జంక్షన్ నుంచి వేలూరు వైపు వెళ్లే వాహనాలను అనుమతించలేదు. కలెక్టరేట్, గిరింపేట, రెడ్డిగుంట ప్రాంతాలకు వెళ్లే వారిని ఇరువారం బైపాస్ మీదుగా వెళ్లాలని పోలీసులు సూచించడంతో ఇబ్బందులు పడ్డారు. గంగినేని చెరువు, కొండమిట్ట, గిరింపేట, దుర్గమ్మ ఆలయం వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చడంతో పొగతో స్థానికులు ఇబ్బందిపడ్డారు.

డిప్యూటీ మేయర్ కారు షెడ్‌లో భారీగా మద్యం స్వాధీనం

- రూ.10లక్షల విలువైన 170 మద్యం కేసుల సీజ్



డిప్యూటీ మేయర్ కారు షెడ్డులో సీజ్ చేసిన మద్యంతో అధికారులు

చిత్తూరు, ఏప్రిల్ 18: చిత్తూరు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కారు షెడ్డులో గురువారం ఎస్ఈబీ అధికారులు భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ విజయ్ కుమార్ వివరాల మేరకు... నగరంలోని బాపూజీనగర్ పరిధిలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కారు షెడ్డులో కర్ణాటక మద్యం నిల్వ ఉందని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం వచ్చింది. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఒకటవ పట్టణ పోలీసులతో కలసి ఎస్ఈబీ అధికారులు కారు షెడ్డులోని ఆఫీస్‌పై దాడులు చేశారు. రూ.10 లక్షల విలువైన చేసే ఒరిజనల్ చాయిస్ విస్కీ 70 కేసులు, అమృత్ సిల్వర్ కప్ 100 కేసులతో కలిపి మొత్తం 170 కేసుల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేశారు. షెడ్డు డిప్యూటీ మేయర్‌దని అక్కడున్న స్వీపర్ చెప్పడంతో కేసు నమోదు చేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు గజరాజు బలి

గంగవరం, ఏప్రిల్ 18 : మండలంలోని బూడిదపల్లె సమీపంలో వేటగాళ్ల ఉచ్చుకు మగ ఏనుగు మృత్యువాతపడింది. బుధవారం రాత్రి వేటగాళ్లు అడవి జంతువుల కోసం బూడిదపల్లె సమీపంలోని రైతు లక్ష్మయ్య పొలంలో కరెంటు తీగలను అమర్చారు. అర్ధరాత్రి అటువైపుగా వచ్చిన ఒంటరి ఏనుగు వాటిని తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం ఉదయం పశువుల కాపరులు, రైతులు గుర్తించి అటవీశాఖ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు, ఎఫ్ఆర్‌వో శివన్న, జిల్లా అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని ఏనుగు కళేబరాన్ని పరిశీలించారు. ఒంటిపై ఉన్న గాయాలను బట్టి కరెంట్ షాక్‌తోనే మృతిచెందిందని నిర్ధారించారు. మగ ఏనుగు అని, దాని వయస్సు 20 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. జిల్లా అటవీ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, అక్కడే ఖననం చేశారు. ఏనుగు మృతికి కారణమైన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



బాబుకు ఓటు.. అభివృద్ధికి చోటు


కొత్తపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కుప్పం, ఏప్రిల్ 18: చంద్రబాబుకు ఓటేసి గెలిపిస్తే అభివృద్ధికి చోటు లభిస్తుందని కుప్పం కొత్తపేట టీడీపీ ఇన్‌ఛార్జి అప్పు ముఖేశ్, నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, కుమ్మర సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ కుమార్‌లు అన్నారు. వారు కొత్తపేటలో గురువారం స్థానిక నేతలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిం చాలని అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యేంద్ర శేఖర్, గోపీనాథ్, స్థానిక బూత్ కన్వీనర్లు కృష్ణన్, మణి, అన్సర్ బాషా, అంజి, కృష్ణ, వాసు, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి యువత


పార్టీలో చేరిన యువకులతో నరేశ్

కుప్పం, ఏప్రిల్ 18: కుప్పం పురపాలక సంఘం బాబు నగర్ కాలనీకి చెందిన యువకులు గురువారం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు చెప్పారు.

కుప్పం అసెంబ్లీకి నామినేషన్లు నిల్

కుప్పం, ఏప్రిల్ 18: కుప్పంలో నామినేషన్ల మొదటి రోజైన గురువారం ఎవరూ నామినేషన్లు వేయలేదు. నామినేషన్ల సందర్భంగా నామినేషన్ల కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం వద్ద డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఇతరులను అనుమతించలేదు. ఎస్సార్‌ఎం సినిమా హాలు వద్ద, అటు తపాలా కార్యాలయం వీధి మలుపు వద్ద నేతారోడ్డుపైన బారికేడ్లు వేసి ట్రాఫిక్‌ను మళ్లించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం

చౌడేపల్లె, ఏప్రిల్18: చౌడేపల్లె స్కూల్ ఫ్లస్‌లో ఇంటర్‌లో జిల్లా మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శంకరయ్యలు నగదు బహుమతులు అందించారు. గురువారం జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిన రజనికి రూ..1116, ద్వితీయ స్థానం సాధించిన అమృతాకు రూ.516లను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, శ్రీనివాసన్, అమర్నాథ్‌రెడ్డి, సోమశేఖర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

25న గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష

బైరెడ్డిపల్లె: గురుకుల పాఠశాలలో 5, 6, 8 తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీ ఉదయం 10 నుంచి 12గంటల వరకు చిత్తూరులో ప్రవేశపరీక్ష జరుగుతుందని కమ్మనపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. హాల్‌టికెట్లను విద్యార్థుల వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పలమనేరు: పలమనేరు కోర్టులో మే11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు కోరారు.

చల్లా రామచంద్రారెడ్డిని గెలిపిద్దాం

కల్లూరు, ఏప్రిల్ 18: పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి విజయానికి అందరం కృషిచేయాలని టీడీపీ నాయకులు గోపినాయుడు, నాగరాజనాయుడు, రవి, రాజగోపాల్‌నాయుడు కోరారు. గురువారం పులిచెర్ల మండలం రాయవారిపల్లి పంచాయతీ పుచ్చల వారిపల్లెలోని మాతమ్మ ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. మేదరపల్లి, కలిగుండ్లవారిపల్లెల్లో ప్రచారం సాగించారు. నాయకులు పురుషోత్తం నాయుడు, అరుణాచలంనాయుడు, గిరిబాబు, సాగర్, వినీల్ పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణాలు గాలికి వదిలేశారన్నారు. పైగా ఇసుక, మైనింగ్, అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. మంచిరోజుల కోసం ప్రజలు తెలుగుదేశం పాలన కోరుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, శమిపతి, రెడ్డెప్పయాదవ్, గంగాధర్, నారాయణరెడ్డి, దామోదర్, హరి, ఎం.రాజశేఖర్, ఏ.రాజశేఖర్, సీవీరెడ్డి, సుహేల్‌బాషా, సద్దాంహుసేన్, షామీర్, కోలాట వెంకటరమణ, ప్రసాద్, రాంబాబు, సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు విరూపాక్షి, బాలాజీనాయక్, హరినాయక్, శ్రీనివాసులు, చైతన్యరాయల్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ గౌరవం, గుర్తింపు ఉంటుందని చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలోని ఆయన ఇంటి వద్ద పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె, రేణుమాకులవారిపల్లె, రామిరెడ్డిగారి పల్లె పంచాయతీలకు చెందిన 25 వైసీపీ కుటుంబాలవారు టీడీపీలోకి చేరారు. జి.సుధాకర్‌రెడ్డి, శివకృష్ణ, ఎం.నారాయణ, బి.నరసింహులు, లక్ష్మీనారాయణ, డి.నరసింహులు, ఎస్. శ్రీనివాసులు, టి.యల్లప్ప లతో పాటు మరికొందరికి చల్లాబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 22వతేదీన మరో సెట్ నామినేషన్ వేస్తానని తెలియజేశారు. తనను ఎమ్మెల్యేగా, కిరణ్ కుమార్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగివెంకట్రమణ, రాజంపేట పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి ధనంజయనాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.


చంద్రమాకులపల్లెలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు


పులిచెర్ల మండలం పుచ్చల వారిపల్లెలోని మాతమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రచారం ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు


రొంపిచెర్లలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కుప్పానికి ప్రత్యేక మ్యానిఫెస్టో : కంచర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఏప్రిల్ 18: కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం చంద్రబాబు 20 అంశాలతో ప్రత్యేక మ్యానిఫెస్టో సిద్ధం చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ వెల్లడించారు. గురువారం చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి వేయనున్న నామినేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన చంద్రబాబును ఈ సారి లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధిని కాంక్షించే చంద్రబాబును గెలిపించుకోవడం అందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 18 : మండలంలోని తీర్థం గ్రామంలో ఉన్న రామ చంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు మురళీకృష్ణాచార్యులు, రాజేష్ సీతారాముల ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ గావించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు స్వామివారి తలంబ్రాలను భక్తులకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి పద్మావతి, ఆనందరావు ఉభయదారులుగా వ్యవహరించారు. నిర్వాహకులు మురళీధరరావు, సుందరేష్, శ్రీనివాసమూర్తి, బాలాజి, కృష్ణమూర్తి, రాజన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంటలపై అడవి పందుల దాడి

సోమల, ఏప్రిల్ 18: కోత దశలోని వరిపంటలను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం రాత్రి స్థానిక వినాయక స్వామి ఆలయం వద్ద వరి పొలంలో అడవి పందులు పడి పంటను తొక్కి వేశాయి. అదేవిధంగా సోమల పట్టణానికి చెందిన సుధాకర్, సురేంద్ర, నవీన్ వరి పొలాలను తొక్కేసి నాశనం చేశాయి. రైతులు పొలాల వద్ద రాత్రి జాగరం చేస్తున్నా ఏదో సమయంలో తొక్కేసి పంటను నాశనం చేస్తున్నాయి.

జోరుగా నామినేషన్లు

పుంగనూరు, ఏప్రిల్ 18: పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి గురువారం ఎన్నికల రిట ర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. తొలుత కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్ వద్ద గల కురు దుమలై వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసిన తర్వాత స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే డమ్మీ అభ్యర్థిగా ఆయన కుమార్తె చల్లా పూజా రెడ్డి మరో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వారివెంట టీడీపీ నాయకులు ఎం.వెంకట్రమణరాజు, సీవీరెడ్డి, న్యాయవాది బి.వెంకటముని యాదవ్, సుహేల్ బాషా, ఆర్వీటీ బాబు వెళ్లారు. ● పుంగనూరు అసెంబ్లీ ఎస్డీపీఐ (సోషియల్ డెమక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) అభ్యర్థిగా ఎస్.అన్వర్‌బాషా ఆర్వో మధుసూదన రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ● పుంగనూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జి.మురళీమోహన్‌యాదవ్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో మధుసూదన్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న ఎస్‌డీపీఐ అభ్యర్థి అన్వర్‌బాషా


నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్‌యాదవ్

భూత వాహనంపై విహరించిన కాశీవిశ్వేశ్వరుడు



రామకుప్పం, ఏప్రిల్ 18: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు, అమ్మవారితో కలిసి భూత వాహనంపై విహరించారు. ఉభయదారులు బాలాజీ స్వామి, బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి విద్యుద్దీప, పుష్పాలంకృత భూతవాహనంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. రాత్రి ఆలయం వద్ద అవులకుప్పానికి చెందిన కళాకారుల పందరి భజనలు ఆకట్టుకున్నాయి.

పలమనేరు టీడీపీలోకి భారీగా వలసలు

పలమనేరు, ఏప్రిల్18 : మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పలమనేరులోని 22వ వార్డుకు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సుధాకర్, సత్యగంగమ్మగుడి మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు క్రిష్ణమూర్తి, టెంపో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్బీఎస్ జగదీష్, రెడ్డెప్ప, పట్టినాయుడులతో పాటు వారి అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా పలమనేరు మాజీ వైస్ ఎంపీపీ, వైసీపీ సీనియర్ నాయకులు రంగయ్య నాయుడు తనమద్దుతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. రంగయ్యనాయుడుతో పాటు మండలానికి చెందిన జగదీష్, మోహన్, సుబ్రమణ్యం, మణికంఠ, షన్ముగం, బాలాజీ, థామస్, పౌల్‌రాజ్, రాజా, కుమార్, ప్రవీణ్, శశికుమార్ టీడీపీ తీర్థం స్వీకరించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నాగరాజరెడ్డి, యూత్ అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, కవీంద్రనాయుడు, ఆనందనాయుడు, పూర్ణచంద్రనాయుడు, రఘునాథరెడ్డి, అనిల్, మురళీ మోహన్, నాగరాజు, సుధాకర్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు. ● గంగవరం మండలం జీడిమాకులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, ఆయన సతీమణి, వెంగంవారిపల్లి మాజీ సర్పంచ్ జయప్ప, మారేడుపల్లికి చెందిన బాబు, కొంగోళ్లపల్లికి చెందిన సుబ్రమణ్యం, యుగేష్, వరలక్ష్మి, శకుంతలమ్మ, దేవా పార్టీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సురేంద్రబాబు, బాలచంద్రారెడ్డి, రవి పాల్గొన్నారు.


అమరనాథరెడ్డి సమక్షంలో తనమద్దతు దారులతో టీడీపీలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ

22న నామినేషన్ వేస్తా

ఈ నెల 22న నామినేషన్ వేస్తానని ప్రజలు తన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు ఓం శక్తి ఆలయం వద్ద పూజలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేస్తానని వివరించారు.


టీడీపీలో చేరిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, టెంపో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

25 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం

పుంగనూరు, ఏప్రిల్ 18: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ నామినేషన్ల తొలిరోజు నలుగురు నామినేషన్లు వేశారని చెప్పారు. 25వ తేదీ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు పరిశీలన జరుగుతుందని, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు వేయవచ్చునని పేర్కొన్నారు. ఆర్వో కార్యాలయం వద్ద పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కార్యక్రమాల్లో తహసీల్దార్ శివన్న పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కుప్పం, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం కుప్పం పట్టణంలోని స్కైబర్ డైనమిక్స్ ఫ్యాక్టరీలో కుప్పం అగ్నిమాపకాధికారి డి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అక్కడి సిబ్బందికి ఆయిల్ ఫైర్స్ గ్యాస్ ఫైర్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రెడ్డెన్న, నరేష్, కృష్ణయ్య, సత్య, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, రామ్మూర్తి, రఘుపతి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులోని గురుకుల పాఠశాల విద్యార్థినులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక కేంద్రం అధికారి మనోగరన్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదలను ఎలా నివారించాలో వివరించారు.

పుంగనూరు రూరల్: పుంగనూరు అక్షర ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంటలు ఆర్పడం, వ్యాప్తిని తగ్గించడం, ఫైర్ ఇంజన్ పనిచేసే విధానం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


వల్లిగట్లలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సోమల, ఏప్రిల్ 18: టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరం పని చేస్తా మని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వల్లిగట్లలో పుంగనూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిలను గెలిపించాలని ఇంటింటా కరప్రతాలను అందజేశారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు విశ్వనాథం, సుబ్బరాయులు, సత్యనారాయణ, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దిగువపల్లెలో టీడీపీ ముమ్మర ప్రచారం



చౌడేపల్లె, ఏప్రిల్18: మండలంలోని దిగువపల్లె పంచాయతీలో టీడీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. గురువారం టీడీపీ నాయకులు బోయకొండ సుబ్బు ఆధ్వర్యంలో ఇంటింటికీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. పుంగనూరు ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి, సోమశేఖర్, బాలాజి, బాలు, గణపతి, శివ, మణి పాల్గొన్నారు.

సారా స్వాధీనం..ఒకరి అరెస్టు

రామకుప్పం, ఏప్రిల్ 18: మండలంలోని చిక్కపల్లెతాండాకు చెందిన తిప్పానాయక్ ద్విచక్రవాహనంలో సారా తరలిస్తుండగా అతడి గ్రామ సమీపంలోనే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతడి నుంచి 25 లీటర్ల సారా కలిగిన క్యానును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలియజేశారు.

పలమనేరులో వైసీపీ అభ్యర్థి నామినేషన్

పలమనేరు, ఏప్రిల్18 : పలమనేరు వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ నామినేషన్ వేశారు. ఆయన సతీమణి పావని డమ్మీగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం వారు పలమనేరు ఆర్‌ఓ మనోజ్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

సోమల, ఏప్రిల్ 18: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శివ కోరారు. గురువారం కందూరు, పెద్దఉప్పరపల్లెల్లో ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

అట్టహాసంగా రామచంద్రయాదవ్ నామినేషన్



మంగళగిరిలో నామినేషన్ వేయడానికి ఎద్దుల బండిపై వెళుతున్న రామచంద్రయాదవ్, పుంగనూరులో ప్రచారం చేస్తున్న బీసీవై పార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్18: మంగళగిరిలో బీసీవై పార్టీ అభ్యర్థిగా గురువారం బోడే రామచంద్రయాదవ్ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వినూత్నంగా ఎద్దులబండిపై ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా ఇప్పటివరకు రాష్ట్రానికి రాజధాని లేదన్నారు. రాష్ట్రంలో భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన చేయడానికే బీసీవై పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలు, కక్షసాధింపులు, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలు అవకాశం కల్పిస్తే మంగళగిరి, పుంగనూరు నియోజకవర్గాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న పుంగనూరులో నామినేషన్ వేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

రౌడీరాజ్యం అంతానికి బీసీవై పార్టీని ఆదరించండి

పుంగనూరు రూరల్: పుంగనూరులో వైసీపీ రౌడీరాజ్యం అంతం కావడానికి ప్రజలు బీసీవై పార్టీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌ను ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పుంగనూరులోని 26, 27, 28, 29, 30, 31 వార్డుల్లో విస్తృతంగా బీసీవై పార్టీ ఎన్నిక ప్రచార సమన్వయకర్తలు సి.సాంబ మూర్తి, ఆర్.హరినాథరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పుంగనూరులో ఉపాధి, అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలు స్థాపన రామచంద్రయాదవ్‌కు మాత్రమే సాధ్యమని చెప్పారు. పుంగనూరులో బీసీవై పార్టీ గెలిస్తే పతంజలి అనుబంధ పరిశ్రమతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలియజేశారు. ప్రతి రైతుకు సొంత నిధులతో పాడి ఆవు పంపిణీ చేస్తారని, ప్రతి మండల కేంద్రంలో పాలరైతులను దోపిడీ నుంచి కాపాడేందుకు పాల డెయిరీలు ఏర్పాటు చేస్తారని వివరించారు. వైసీపీ చేస్తున్న అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను అరికట్టడం బీసీవై పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉచిత పథకాల పేరుతో ఓ పక్క నగదు ఇస్తూనే ప్రజలకు తెలియకుండానే వారి నుంచి వివిధ పన్నుల రూపంలో తిరిగి అంతకంటే ఎక్కువ వసూలు చేస్తోందని ప్రజలు గమనించాలని కోరారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఓటర్లకు ఇచ్చి ఐదేళ్లలో కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిం చారు. గతంలో నియోజకవర్గంలో ఎలాంటి ఘర్షణలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, దాడులు జరిగేవి కావని, ప్రస్తుతం ఎక్కడ చూసినా వైసీపీ నాయకులు దౌర్జన్యాలే కనిపిస్తున్నాయని గుర్తుచేశారు. ప్రజలు గమనించి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకుని వైసీపీ అనుకూలంగా ఉన్న నాయకులు నామినేషన్లు వేయించుకుని ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం, ఇళ్లపై దాడులు చేసి ధ్వంసం చేసిన సంఘటనలు ప్రజలు గుర్తుచేసుకోవాలని విన్నవిం చారు. బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌కు చెరుకు రైతు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీసీవై గెలిస్తే పుంగనూరు ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తారని తెలియజేశారు. బీసీవై పార్టీ నాయకులు రెడ్డి, షేక్ సమీవుల్లా, నూర్, మున్నా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- తొలిసారి రెడ్‌జోన్‌లో పెద్దపంజాణి
- ఆరెంజ్ జోన్‌లోకి నాలుగు మండలాలు
- చాలా మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలో ఎండలు దారెత్తిస్తున్నాయి. నాలుగు రోజుల నుంచి భగభగలాడుతున్న భానుడు గురువారం మరింత మండిపోయాడు. దీంతో తొలిసారిగా పెద్దపంజాణి మండలం రెడ్‌జోన్‌లోకి వెళ్లగా, ఆరెంజ్ జోన్‌లో గుడుపల్లి, పులిచెర్ల, నింద్ర, తవణంపల్లె మండలాలు చేరాయి. చాలా మండలాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. వడగాల్పులు తోడవడంతో జనం తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండతీవ్రత కనిపిస్తుండగా 11 గంటలకు చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటుతోంది. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరిస్థితి తీవ్రంగా ఉంది.

మండలాల వారీగా ఉష్ణోగ్రత వివరాలు..

పెద్దపంజాణిలో 44, నింద్ర 43.4, తవణంపల్లె 43.3, పులిచెర్ల 43, శ్రీరంగరాజపురం 42.1, గుడిపాల 41.8, పూతలపట్టు 41.5, గుడుపల్లె 41.4, సదుం 41.3, బంగారుపాళ్యం 41.3, పుంగనూరు 41.2, కుప్పం 41.0, చిత్తూరు 40.8, చౌడేపల్లి 40.7, ఐరాల 40.7, కార్వేటినగరం 40.7, నగరి 40.7, పాలసముద్రం 40.7, రొంపిచెర్ల 40.7, యాదమరి 40.7, సోమల 40.4, గంగాధరనెల్లూరు 40.4, వెదురుకుప్పం 39.9, శాంతిపురం 39.8, గంగవరం 39.5, పలమనేరు 39.4, పెనుమూరు 39.4, విజయపురం 38.9, రామకుప్పం 38.6, వి.కోట 38.6, బైరెడ్డిపల్లి 38 డిగ్రీలు నమోదైంది.





మన్నవరం భెల్-ఎన్టీపీసీ ప్రాజెక్టు ప్రవేశ ద్వారం

● చెప్పాడంటే.. చేయడంతే!

'మన్నవరం' ఏమైంది జగన్?

పదవీ కాలం పూర్తయినా పత్తా లేని ప్రాజెక్టు

తెరిపిస్తానన్న హామీ నిలబెట్టుకోని సీఎం



అధికారంలోకి రాగానే మన్నవరం పారిశ్రామిక ప్రాజెక్టు పూర్తి చేయిస్తా.

- పాదయాత్ర సందర్భంగా 2018 జనవరి 21న శ్రీకాళహస్తిలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. 30 వేల మందికి ఉద్యోగాలు దొరికే భారీ ప్రాజెక్టు కావడంతో ఈ మాటకు జిల్లా ప్రజలు మురిసిపోయారు. ఓట్లన్నీ గంపగుత్తగా వైసీపీకి వేసేశారు. ఆయనైతే అధికారంలోకి వచ్చారు. కానీ, ఐదేళ్లు గడిచినా మన్నవరం ప్రాజెక్టు అతీగతీ లేదు. ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి? అని పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి కేంద్రాన్ని ప్రశ్నించడంతో సరిపెట్టారంతే.



ప్రాజెక్టు స్వరూపం:

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (బీహెచ్ఇఎల్-ఎన్టీపీసీ) వంటి ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో విద్యుత్ ఉపకరణాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించాయి. రూ.6500 కోట్ల భారీ పెట్టుబడితో, 30 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించే ఈ భారీ పరిశ్రమను ఎన్టీపీసీ భెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట జాయింట్ వెంచర్‌లో నెలకొల్పేందుకు ఒప్పందానికి వచ్చాయి. 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మన్నవరం వద్ద ఆ ప్రాంతానికి దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరిట వైఎస్ఆర్ పురం అని పేరు కూడా పెట్టారు. ఈ పరిశ్రమకు అనుబంధంగా 30 పరిశ్రమలు కూడా ఏర్పాటవుతాయని అప్పట్లో కేంద్రం ప్రకటించింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై శ్రద్ధ పెట్టలేదు. భెల్, ఎన్టీపీసీ సంస్థలు రూ.వంద కోట్ల చొప్పున రూ.200 కోట్లు ప్రాథమికంగా విడుదల చేశాయి. పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, ప్రహరీ నిర్మించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు పూర్తిగా మరుగునపడిపోయింది. జిల్లాలోని నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. ఆ సమయంలో తాను అధికారంలోకి రాగానే మన్నవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయించడానికి ప్రయత్నిస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ చెప్పిన మాట.. యువతలో ఆశలు నింపింది.

ఎంపీ ప్రశ్నతో సరి

2019 జూన్‌లో జగన్ సీఎం అయ్యాక మన్నవరం ప్రాజెక్టు పూర్తి చేయించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయలేదు. సంబంధిత మంత్రులతో, ప్రధానితో మాట్లాడలేదు. కనీసం ఎంపీల బృందాన్ని కూడా కేంద్రం వద్దకు పంపింది లేదు. పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి మాత్రం ఒకసారి మన్నవరం ప్రాజెక్టు పరిస్థితి ఏమిటనే ప్రశ్న లేవనెత్తారు. అది తప్ప రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఇంకెలాంటి ప్రయత్నం జరగలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో అధికార పార్టీలో బలమైన నేతలున్నా 30 వేల మందికి ఉద్యోగాలు లభించే ఈ ప్రాజెక్టుపై కనీస శ్రద్ధ పెట్టలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యంత అవినీతిపరులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోకుండా, బదిలీలు కాకుండా సీఎంవోలో పలుకుబడి ప్రదర్శించిన అక్కడి ఎమ్మెల్యే.. పదిమందికీ ఉపయోగపడే ఈ పని గురించి మాత్రం తనకు సన్నిహితుడైన సీఎం జగన్ వద్ద ఏనాడూ ప్రస్తావించింది లేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 18 : మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో శ్రీకృష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల వారి దేవస్థానం మహాభారతం ఉత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయంలో ధ్వజస్తంభం పూజా కార్యక్రమాన్ని చేశారు. ఈనెల 28వ తేదీ వరకు మహాభారతం ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి పగలు హరికథా కాలక్షేపం మొదలైందని, శుక్రవారం నుంచి రాత్రి వీధి నాటకాలు ఉంటాయని చెప్పారు. ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని కార్యనిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, బోడిరెడ్డి తారకరెడ్డి చెప్పారు.



ధ్వజస్తంభ పూజా కార్యక్రమంలో...

డీలర్, సంఘమిత్ర కోడ్ ఉల్లంఘన

ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



మంత్రి పెద్దిరెడ్డి సమావేశంలో సంఘమిత్ర దివ్య



కల్లూరులో వైసీపీ ఎన్నికల ప్రచారంలో డీలర్ షాహీనా

కల్లూరు, ఏప్రిల్ 18: పులిచెర్ల మండలం కల్లూరు చౌక దుకాణం-31 డీలర్ షాహీనా, ఎల్లంకివారిపల్లి సంఘమిత్ర కె.దివ్య ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ స్థానిక టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, అష్రఫ్ గురువారం ఎంపీడీఓ సురేష్‌బాబు, తహసీల్దార్ వసంతలతకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఎల్లంకివారిపల్లిలో ఈనెల 17న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్న ఎన్నికల ప్రచార సమావేశంలో సంఘమిత్ర దివ్య పాల్గొందని టీడీపీ నేత గోపాల్‌నాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం కల్లూరులో నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో కల్లూరు చౌకదుకాణం-31 డీలర్ షాహీనా పాల్గొందని అష్రఫ్ ఫిర్యాదులో తెలిపారు. పరిశీలించి ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్, ఎంపీడీవో తెలిపారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న కారు

చిన్నారి మృతి, మరో ఇద్దరికి గాయాలు





రోదిస్తున్న బంధువులు - మృతిచెందిన గగన్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 18: కారు సిమెంట్ దిమ్మెను ఢీకొనడంతో చిన్నారి మృతిచెందింది. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నెలవాయి వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎస్ఆర్‌పురం గ్రామానికి చెందిన బుజ్జిబాబు, అతని భార్య, కుమార్తె, బావమరిది పెద్దబ్బ కుమారుడు గగన్(7) కారులో తిరుపతికి వెళ్లారు. కుమార్తెను కాలేజీలో వదిలి తిరిగి వస్తుండగా ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి గ్రామం వద్ద చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొంది. ఈ ఘటనలో గగన్ అక్కడికక్కడే మృతిచెందాడు. బుజ్జిబాబు దంపతులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్‌పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని వేలూరు సీఎంసీకి తరలించారు. గగన్ మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పరామర్శించారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించా

టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18: జిల్లా అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన నిరాడంబరంగా నామినేషన్ వేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హంగూ ఆర్భాటాలతో ప్రజలకు ఏమీ మేలు జరగదన్నారు. ప్రజాభిమానం ఉన్న నాయకులకు ఆడంబరాలు అవసరంలేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతో, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీయర్ స్ఫూర్తితో, నారా చంద్రబాబు నాయకత్వం నచ్చి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే చిత్తూరు పార్లమెంటును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే దగ్గుమళ్ళ ప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలసి ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తాం

ఐరాల : సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపిస్తే అభివృద్ధిని చేసి చూపెడతామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల సుజాత ప్రజలను కోరారు. గురువారం రాత్రి ఐరాల మండలం 35యర్లంపల్లె పంచాయతీ దివిటివారిపల్లెలో ఆమె కుటుంబ సభ్యులతో కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు లత, స్వర్ణ, చిత్రానాయుడు, కొల్లారమేష్, దయానందమండడి, రాజ్‌కుమార్, తులసీప్రసాద్, దిలీప్‌రాయల్, భాస్కరయ్య పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువా వేసిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పెనుమూరు : మండలంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వారికి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రకాష్‌నాయుడు, న్యాయవాది దద్దాల జగదీష్, రమణయ్యనాయుడు, సిద్దయ్యనాయుడు, రామకృష్ణనాయుడు, ప్రసాద్‌నాయుడుతోపాటు మరోకొందరు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పార్లమెంటు ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, లోకనాథనాయుడు, హరిబాబునాయుడు, ఈశ్వర్‌ప్రసాద్, కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటు వేసేవారి వివరాలు..

20 నుంచి సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 85 ఏళ్లు దాటి మంచానికే పరిమితమైన వృద్ధులు, 40శాతం పైబడి వైకల్యంతో కదల్లేని స్థితిలో ఉన్న వారికి ఇంటినుంచే ఓటు వేసే హక్కు కల్పిస్తున్నట్లు, వారి వివరాలు గురువారం నుంచి శనివారం వరకు సేకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 85 ఏళ్లు మించిన వయోవృద్ధులు 6వేలమంది, దివ్యాంగులు 23వేల మంది ఉన్నట్లు అంచనా వేశామన్నారు. బీఎల్వోల సహకారంతో సెక్టోరల్ ఆఫీసర్లు వారి ఇళ్లకు వెళ్లి ఫారం-12డి (బ్యాలెట్ పేపర్) ఇవ్వనున్నట్లు చెప్పారు. మే 3, 4, 5 తేదీల్లో తొలి రౌండ్ హోం ఓటింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. పీవో, ఏపీవో, ఓపీవోలతోపాటు ఎన్నికల కమిషన్ గుర్తించిన 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందిస్తామని చెప్పారు. వీరందరూ ఈనెల 20వ తేదీలోగా హెచ్‌వోడీల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తారు



కుప్పం, ఏప్రిల్ 18: కుప్పంలో అందరూ సంతోషంగా ఉండడమే చంద్రబాబు ధ్యేయమని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. గురువారం రాత్రి ఆమె తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే ఆయనకంటూ ఒక టీమ్ అవసరమన్నారు. కుప్పంలోని కార్యకర్తలు, నాయకులు, ఇక్కడి ప్రజలతోనే తమకంటే ఆయన ఎక్కువ సమయం గడిపారన్నారు. ఏడుసార్లు వరుసగా చంద్రబాబును కుప్పం ప్రజలు గెలిపించారని, ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గంతోపాటు ఇక్కడి ప్రజల బతుకులు అస్తవ్యస్తమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అరాచకాలను, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ అక్రమ కేసులను భరిస్తూ పసుపు జెండాను నిలబెడుతూ వస్తున్న కుప్పం కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గురువారం జరగబోయే నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు తరలి రావాలని కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

ఉదయం 10.45 గంటలకు వరదరాజస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు

12 గంటలకు కుప్పం చెరువుకట్ట నుంచి పట్టణంలోకి ర్యాలీగా ప్రవేశం

1 గంటకు ఆర్వో కార్యాలయం

1.27 గంటలకు నామినేషన్ దాఖలు

5నుంచి 7గంటల వరకు కుప్పం టీడీపీ కార్యాలయ ఆవరణలో పట్టణ ప్రముఖులతో ముఖాముఖి, వారితో కలసి భోజనం.

రేపటి కార్యక్రమాలు..

ఉదయం 9 గంటలకు చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సామగుట్టపల్లె సమీపంలోని కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజలు

10 నుంచి 12 గంటల వరకు పార్టీ కార్యాలయ ఆవరణలో ముస్లిం మైనారిటీ మహిళలతో ముఖాముఖి

12 నుంచి 1గంట వరకు కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలో పేదలకు అన్నదానం

4 గంటలకు కుప్పం నుంచి బెంగళూరు ఎయిర్ పోర్టుకు పయనం.

బాధితుడిపైనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పుంగనూరు పోలీసుల ఏకపక్ష తీరుపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

కిడ్నాప్ చేసి చితకబాది, డ్రగ్స్ ప్యాకెట్లు పెట్టిన వైసీపీ నేతలపై నామమాత్రపు కేసులేనా అంటూ మండిపాటు

పుంగనూరు, ఏప్రిల్ 18: వైసీపీ నేతల చేతిలో కిడ్నాప్‌కు గురై చావుదెబ్బలు తిన్న బాధితుడు, టీడీపీ కార్యకర్త హేమాద్రిపైనే పుంగనూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. పోలీసుల ఏకపక్ష తీరుపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరులో బుధవారం వైసీపీ నేతలు డ్వాక్రా మహిళలతో సమావేశం కావడాన్ని ఫొటోలు తీశారనే కోపంతో వైసీపీ నాయకులు నాగభూషణం, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్త హేమాద్రిని కిడ్నాప్ చేసి, టీడీపీ ఎన్నికల ప్రచారంలో తిరిగితే చంపేస్తామని బెదిరించి చొక్కాచింపి చితకబాది డ్రగ్స్ ప్యాకెట్లు చేతిలో పెట్టి వీడియో చిత్రీకరించిన విషయం విదితమే. టీడీపీ నేతలే బాధితుడిని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయగా రాత్రి వరకు పోలీసుస్టేషన్‌లో పెట్టి హేమాద్రితోపాటు మరికొందరిపై తప్పుడు కేసులు పెట్టారు. ఇది దారుణమని, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. నెల రోజుల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు మంత్రి పెద్దిరెడ్డికి తొత్తులుగా పనిచేసిన పోలీసులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

9మంది టీడీపీ నేతలపై ఎస్సీ ఎస్టీ కేసులు

టీడీపీ కార్యకర్త హేమాద్రి, మరికొందరు నాయకులు తనను కులం పేరుతో దూర్భాషలాడి దౌర్జన్యానికి దిగినట్లు వైసీపీ నాయకుడు బండ్ల ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 9 మంది టీడీపీ నేతలపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు. ఇందులో హేమాద్రితోపాటు ఎస్.సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు,సద్దాం, పర్వేజ్, షామీర్, అఫ్రోజ్ (అప్పు)పోలీస్‌గిరి, నాగరాజు, మరికొందరు ఉన్నారు.

ఏడుగురు వైసీపీ నేతలపై కేసు

టీడీపీ కార్యకర్త హేమాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మదనపల్లె మున్సిపల్ వైస్ ఛైర్మన్, పుంగనూరు వైసీపీ ఎన్నికల పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అమ్ము, వైసీపీ నాయకులు సాయి, వక్ఫ్‌బోర్డు ఇర్ఫాన్, బండ్ల ప్రభు, అమ్ముకుట్టి, మంజులపై కేసు నమోదు చేశారు.





మృతులు
గణేష్ - చిన్నబ్బరెడ్డి

రెండు ద్విచక్ర వాహనాల ఢీ : ఇద్దరి మృతి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 18: మండలంలోని నెల్లేపల్లెమిట్టకు సమీపంలో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. గంగాధరనెల్లూరు సీఐ శంకర్ కథనం మేరకు.. చిత్తూరు - పుత్తూరు రహదారి గంగాధరనెల్లూరు మండలం వరదరాజుపురం గ్రామానికి చెందిన చిన్నమరెడ్డి కుమారుడు చిన్నబ్బరెడ్డి(53) వ్యక్తిగత పనిమీద స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై గంగాధరనెల్లూరుకు వస్తున్నారు. అదే సమయానికి శ్రీరంగరాజుపురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన పాండ్యన్ నాటార్ కుమారుడు గణేష్ అలియాస్ గణేష్‌నాటార్ (22) కొత్తపల్లెమిట్టకు వెళుతున్నాడు. నెల్లేపల్లెమిట్టకు సమీపంలో ఇద్దరు ఎదురెదురుగా ఢీకొన్నారు. చిన్నబ్బరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కమనీయం.. కోదండరాముడి కల్యాణం



అమ్మవారి మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు



ఏనుగుపై ముత్యాల తలంబ్రాల ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 18: తిరుపతిలోని కోదండరామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలోని విద్యుత్ అలంకరణల మధ్య వెలుగులీనే వేదికపై అర్చక స్వాములు ఆదిదంపతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. అంతకు ముందు ఉదయం కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవనం నుంచి తలంబ్రాల కోసం ముత్యాలను ఏనుగుపై ఊరేగింపుగా తీసుకువచ్చి కోదండ రామాలయం ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, వేదపండితులు, డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ఇస్తారా.. చస్తారా!

'పిల్చుకొచ్చేటపుడు ఒక మాట. కూలి డబ్బులిచ్చేటప్పుడు ఇంకొక మాట. ఇదేమి న్యాయం?' అంటూ నిలదీస్తున్న ఆ ఆడవాళ్లను చూసి ఏం జరిగిపోతోందా అని ఆసక్తితో కుప్పం నడి బజారులో గురువారం అందరూ పోగయ్యారు. ఫ్లాష్ బ్యాక్ ఏందంటే.. బుదారంనాడు బులుగు పార్టీవోల్లు కుప్పంలో ర్యాలీ పెట్టుకున్నారు. జనం గనంగా ఉండాలనే రొండు నూర్ల మందిని కూడేసినారు. పార్టీ జెండాలు చేతికిచ్చి జేజేలు పలికిస్తూ ఊరంతా తిప్పించినారు. ఎర్రటి ఎండలో తిరిగీ తిరిగీ ఆ పార్టీ లీడరు ఇంటికి చేరుకునేసరికి సాయంత్రమైపాయె. దుడ్లు ఇస్తే వెళ్లిపోదామని బయట నిలబడ్డారు. లేటయిపోతా ఉండడంతో ఇళ్లలో పనీ పాటా ఉంటుంది గదా.. మా దుడ్లు గూడా మీరే తెచ్చేయ్యండి అని చెప్పి కొందరు ఇళ్లకి వెళ్లిపోయారు. ఆ తర్వాత దుడ్లు తెచ్చి పంచే పని మొదులు పెట్టినారు. తలా ఐదొందలు చేతల్లో పెట్టినారు. అయితే ఉండేవాళ్లకే దుడ్లు అని చెప్పడంతో ఎర్రటి ఎండనబడి తిరిగిన ఆడోళ్ల కడుపులు కాలిపాయ. నోళ్లు తెరిచినారు. దాంతో దిగొచ్చి పిల్చుకొచ్చిన వాళ్లందరికీ దుడ్లు లెక్కగట్టి ఇచ్చినారు. - కుప్పం

ఆ ఇద్దరూ కలిసేకి అయ్యేదేనా!

బెదిరించో, బుజ్జగించో మనుషుల్ని కలపచ్చుకానీ, మనసుల్ని కలపగలరా? గురువారం పలమనేరు వైసీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, నామినేషన్ వేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడల తీరు చూస్తే మాత్రం మనసులు కలిపేది అయ్యేకేనా అనిపించింది. వి.కోట మండలానికే చెందిన ఈ ఇద్దరూ ఒకే సామాజికవర్గం కూడా. ఒకే పార్టీలో రెండు కత్తుల్లా కొనసాగుతూనే ఉన్నారు. ప్రొటోకాల్ రగడలు తారస్థాయికి చేరడంతో పెద్దిరెడ్డి మధ్యస్తం తప్పలేదు. ఈసారి టికెట్ తనకు ఇవ్వచ్చు కదా అని శ్రీనివాసులు ఆశపడ్డా అధిష్ఠానం వెంకటేగౌడకే ఇచ్చింది. పార్టీ పెద్దల హెచ్చరికలతో ఇద్దరూ కొంతకాలంగా ఒకే వేదికల మీద కనిపిస్తున్నా ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు. గురువారం పలమనేరులో నామినేషన్ దాఖలుకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలోనూ ఈ ఇద్దరూ ఇలాగే కనిపించారు. దీంతో కష్టమేనప్పా ఇద్దరినీ కలిపేది అని పార్టీవారే చెవులు కొరుక్కున్నారు. - వి.కోట





ఇదీ మందు

చిత్తూరు జన కేతనం



www.andhrajyothy.com

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

సర్పంచులు.. ఒకప్పట్లో వెలిగారు. ప్రజలకు చేరువలో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేస్తూ, మౌలిక వసతులు కల్పిస్తూ గుర్తింపు పొందారు. అలాంటి సర్పంచులను జగన్ ప్రభుత్వం డమ్మీలుగా మార్చేసింది. నిధులు, విధులు, అధికారాలు లేకుండా చేసింది. ఈ పరిణామం పట్ల అధికార పార్టీ గ్రామ ప్రజాప్రతినిధులూ అసహనంతో ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పంచాయతీ ఖాతాల్లో నిధులు మళ్లించిన ప్రభుత్వంపై కేసు పెట్టాలంటూ ధర్నా చేస్తున్న సర్పంచులు (ఫైల్ ఫొటో)

డమ్మీ సర్పంచులు!

- స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్
- పంచాయతీల ఖాతాల్లో నిధులు జీరో
- ఉమ్మడి జిల్లాలో రూ.195 కోట్ల మళ్లింపు
- చిన్న సమస్యనూ పరిష్కరించలేని స్థితిలో గ్రామపాలకులు



మోసం గురూ!

ఉమ్మడి జిల్లాలోని 1411 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్ని విడతల వారీగా రూ.195 కోట్లను జమ చేసింది. జమ చేసిన వెంటనే ఆయా నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. చాలా మంది సర్పంచులు గౌరవం కోసం అప్పులు చేసి మరీ స్థానిక సమస్యల్ని పరిష్కరించారు. ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులకు వడ్డీలు కట్టుకోలేక సర్పంచులు అల్లాడుతున్నారు. ఇక అప్పు చేసే స్తోమతలేని సర్పంచులు సమస్యల్ని అలాగే వదిలేశారు. చిన్నపాటి సమస్యలనూ పరిష్కరించలేక, ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారు. తమ నిధుల్ని మళ్లీ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచులు ఎన్నో ఉద్యమాలు చేశారు. నిధుల్ని దొంగిలించిన సీఎం జగన్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ గతేడాది జూలైలో చిత్తూరులో ధర్నా చేసి, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా, ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీనికితోడు వలంటీరు, సచివాలయ వ్యవస్థతో సర్పంచుల్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో వీరి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ పరిణామాల పట్ల జగన్ ప్రభుత్వంపై సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఉన్నారు.

బంగారుపాళ్యం మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీకి మూడేళ్లలో రూ.39 లక్షల ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. ఈ నిధుల్లో నయా పైసా పంచాయతీ అవసరాలకు ఇవ్వకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. బోర్లు, పైపు లైన్లు, డ్రైనేజీ తదితర పనుల కోసం స్థానిక సర్పంచి ప్రిస్టేజ్ కోసం రూ.14 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశారు. ఆ నిధులు ఏళ్లుగా రాకపోవడంతో వడ్డీలు కట్టుకుంటున్నారు.

ఏ ముఖ్యమంత్రీ చేయలేదిలా..



ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి.. ఇలా ఏ సీఎం కూడా పంచాయతీ కార్యాలయాలకు కరెంటు బిల్లు తీసుకోలేదు. సీఎం జగన్ మాత్రం విద్యుత్తు బకాయిల పేరుతో మా పంచాయతీల నిధుల్ని తీసేసుకున్నారు. ఖజానాలో డబ్బుల్లేకపోవడంతో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్నీ మళ్లించేశారు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి లేకుండా పోయింది. మేము బాధ్యతలు తీసుకుని మూడేళ్లయినా పైసా నిధులు ఇవ్వలేదు.

- భగవతి, ఓటివారిపల్లె సర్పంచి, యాదమరి మండలం

ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నా



నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రజలకు నేను న్యాయం చేయలేకపోతున్నాను. వాటర్ ప్లాంట్ నిర్మించాను, తాగునీటి బోర్లు, పైపు లైన్లు వేశాను. ఇప్పటికే సుమారు రూ.2 లక్షల బిల్లులు రావాలి. కనీసం వీధి లైట్లు వేయాలన్నా ఖాతాల్లో నిధులు లేవు. సొంత డబ్బుల్ని ఖర్చు చేస్తున్నాం.

- ఊహ, నంజరపల్లె సర్పంచి, పెనుమూరు మండలం



జగన్‌ను ఇంటికి పంపేందుకు పనిచేస్తున్నాం



రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన రూ.8660 కోట్ల ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం లాగేసుకుంది. 2023-24 సంవత్సరానికి రెండో విడతగా వచ్చిన రూ.988 కోట్లనూ పంచాయతీల ఖాతాల్లో వేయలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రిజిస్ట్రేషన్, మైనింగ్ ఫీజు, ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొఫెషనల్ ట్యాక్సునూ జమ చేయలేదు. రాష్ట్రంలోని 12918 మంది సర్పంచులు వైఎస్ జగన్‌ను గద్దె దింపాలని పనిచేస్తున్నాం.

- కోకా ప్రకాష్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు

వడ్డీలు కట్టుకోలేక..

మాకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం దొడ్డి దారిన మళ్లించేసింది. దీంతో చిన్నపాటి పనులూ చేయలేకపోతున్నాం. తాగునీటి బోర్ల మరమ్మతు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి లైట్ల వంటి చిన్నపాటి పనులకు అప్పులు చేశా. ఇప్పుడు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నా. నన్ను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నా.

- ఉషశ్రీ, తుంబపాళ్యం సర్పంచి, బంగారుపాళ్యం మండలం

నగరిలో నామినేషన్ వేయాలంటే..!



నగరి అసెంబ్లీ అభ్యర్థులకు ఓ సెంటిమెంటు ఉంది. నామినేషన్ వేసే ముందు వీరంతా పట్టణంలోని కొత్తపేటవద్ద గల అగరవినాయకస్వామి దేవాలయంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ఇలా..

● సెంటిమెంట్

గతంలో మాజీమంత్రి చెంగారెడ్డి, దొరస్వామిరాజు, ప్రస్తుతం భానుప్రకాష్, రోజా ఆ సెంటిమెంట్ పాటిస్తున్నారు. అదే క్రమంలో గురువారం టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆలయంలో పూజలు చేసి.. వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని.. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషను వేశారు.

- నగరి

అభ్యర్థులూ.. నోటరీ విషయంలో జాగ్రత్త

ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులూ.. నోటరీ అంశంలో జాగ్రత్త. లేదంటే నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే ప్రమాదముంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు ధ్రువీకృత లైసెన్స్‌డ్ అడ్వకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయ, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను నామినేషన్ ఫారంలో పూరించి 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వకేట్ నోటరీలు లైసెన్స్ గడువు ముగిశాక రెన్యువల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అనుమతి ఇస్తుంది. చాలామంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది, తర్వాత రెన్యువల్ చేసుకోకుండా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది రిజిస్ట్రేషన్ల కార్యాలయాల పరిధిలో ఐదేళ్ల కిందట వంద మందికి పైగా నోటరీలు ఉండగా, తాజాగా 35 మంది మాత్రమే ఉన్నారు. వారి వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో మంగళవారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఎనిమిది మంది రిటర్నింగ్ అధికారులకు పంపారు. ఇన్‌వ్యాలిడ్ నోటరీలతో ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని అధికారులు సూచిస్తున్నారు.

● నోట్ దిస్ పాయింట్

- చిత్తూరు కలెక్టరేట్

ఫ్యామిలీ క్యాంపెయిన్

చిత్తూరు లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుటుంబ సమేతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుడిపాల మండలం పసుమందలో దగ్గుమళ్ల సతీమణి సుజాత, తనయుడు రాధే, కుమార్తె రాజీవి, కోడలు ఎస్తేర్ ప్రియాంక, మనవళ్లు రేయాన్స్, రిహాన్స్, మనవరాలు మిషికా షైరా, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే పసుమంద గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


- చిత్తూరు సిటీ



● వర్తమానం/కుప్పం

ఒకవైపు అభివృద్ధి జరగలేదు. మరోవైపు దాడులు.. పోలీసు కేసులు పెరిగాయి. అందుకే భారీ ఆధిక్యంతో వైసీపీని ఓడించాలన్న కసితో కుప్పం టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అధినేత నిర్దేశించిన 'లక్ష' లక్ష్యంతో జోష్‌గా ముందుకు సాగుతున్నాయి. అటు వైసీపీ.. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సహాయ నిరాకరణ, విభేదాల ఉక్కపోతతో సతమతమవుతోంది. కొందరు నేతల క్వారీ, ఇసుక, భూదందాలు, అక్రమాలు శాపాలుగా వెంటాడుతున్నాయి. గ్రామాల్లో రెండు పార్టీలకు లభిస్తున్న ఆదరణ పరంగా ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

టీడీపీలో జోష్



- 'లక్ష' మెజారిటీ లక్ష్యంగా విస్తృత ప్రచారం
- విభేదాల ఉక్కపోతలో వైసీపీ
- కుప్పం రాజకీయ ముఖచిత్రం

టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇక్కడే ఉంటూ పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. యువతను సమీకరిస్తూ వారికే ప్రధాన బాధ్యతలు అప్పగిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. మరోవైపు చంద్రబాబు క్లాస్‌మేట్, సుదీర్ఘకాలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న పీఎస్ మునిరత్నం గ్రామాల్లో పర్యటిస్తూ.. సీనియర్లందరినీ ఏక తాటిపైకి తీసుకొచ్చి ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఇంతకాలం అనారోగ్యంతో ఉన్న చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ కూడా జనాల్లోకి వస్తున్నారు. కాంగ్రెస్‌నుంచి పార్టీలో చేరిన డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు గ్రామస్థాయిలో తనకున్న పరిచయాలతో పార్టీ బలాన్ని పెంచడంలో తనవంతు కృషి చేస్తున్నారు. ఇక, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన అనుభవంతో పార్టీకి పునర్వైభవం తేవడంలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. ఇక, చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా విధించుకున్న పార్టీ శ్రేణులు, ఆ దిశగా చురుగ్గా కదులుతున్నాయి. వైసీపీ నవరత్నాల ప్రభావాన్ని సూపర్ సిక్స్ పథకాల ప్రచారంతో దీటుగా ఎదుర్కొంటున్నారు. ఇలా, నాయకులు, కార్యకర్తలు గతంలో చిన్నచిన్న విభేదాలేవైనా ఉంటే పక్కనపెట్టి మరీ ఎన్నికల రంగంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాయకులు వెంట ఉన్నా లేకున్నా ఎవరికివారు స్వచ్ఛందంగా ప్రచారాలలో పాల్గొంటూ టీడీపీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్నారు.



అనిమిగానిపల్లెలో ఇటీవల టీడీపీ నేతల ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న జనం

పెరుగుతున్న చేరికలు : రోజురోజుకు వైసీపీనుంచి పార్టీలో చేరికలు పెరిగిపోతున్నాయి. గ్రామ స్థాయిలో కుటుంబాలకు కుటుంబాలు టీడీపీలో చేరుతున్నాయి. ఇక, ప్రజల్లోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో వీసమంత అభివృద్ధి కనిపించకపోవడంతోపాటు బలహీనులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు, వైసీపీ నేతల ఇసుక, క్వారీ దందాలతో వారు పూర్తిగా విసిగిపోయారు. దీంతో గ్రామాలలో టీడీపీవైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది.

నామమాత్రంగా కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఎప్పటినుంచో పెద్ద దిక్కుగా ఉన్న డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, టీడీపీలో చేరిపోయాక అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో పూర్తిగా తీసికట్టుగా మారిపోయింది. చిన్నా చితకా నాయకులు కొందరు జిల్లా పదవులకు ఎగబాకినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. శాంతిపురం మండలానికి చెందిన ఆవుల గోపి అనే వ్యక్తికి టిక్కెట్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత పెరిగి, కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను శ్రేణులు ధ్వంసం చేసే వరకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పార్టీలపై ప్రభావం చూపే అవకాశం లేదు.

వైసీపీ: విభేదాలు, అసంతృప్తులు

నామినేషన్ల ప్రక్రియ మొదలైనా వైసీపీలో విభేదాలు తగ్గలేదు. పార్టీ శ్రేణులను కలుపుకొని పోవడంలో భరత్ విఫలమయ్యారు. రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్‌కు, భరత్‌కు పొసగడంలేదన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల ప్రచార పర్వంలో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ విధిలేని పరిస్థితుల్లో సఖ్యతగా ఉంటున్నా వీరిద్దరి మధ్యనా సున్నితమైన విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉండనే ఉంది. ఇక, తన సామాజిక వర్గానికే (వన్నెకుల క్షత్రియ) చెందిన హెచ్.ఎం.మురుగేశ్‌కు పార్టీ మండల కన్వీనర్.. ఆయన కుమార్తె అశ్విని ఎంపీపీ, కోడలు వనిత వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పదవులు ఇప్పించారు. ఇలా, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఇవ్వడంపై అదే సామాజిక వర్గ నేతల నుంచీ నిరసన వ్యక్తమవుతోంది. ఇక, భూ ఆక్రమణలు, దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి మురుగేశ్‌మీద ఆరోపణలున్నా, ఈ కుటుంబాన్నే భరత్ వెనకేసుకొస్తున్నారు. మిగిలిన మూడు మండలాల్లోనూ తన సామాజికవర్గంలోని కొందరు నాయకులనే ప్రోత్సహిస్తూ, మిగిలినవారిని నిరాశపరుస్తున్నారన్న ప్రచారం ఉంది. పైగా ఎమ్మెల్సీగా కుప్పం నియోజకవర్గానికి ఈయన చేసిందేమీ లేదు. స్థానికేతరుడు కావడంతో ఇక్కడి వారితో సంబంధాలు చాలా తక్కువ. పైగా వైసీపీ మార్క్ అయిన భూదందాలు, క్వారీ, ఇసుక దందాలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చింది.



ప్రభుత్వంపై సర్పంచుల్లో ఆగ్రహం

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 89 పంచాయతీలలో ఏకంగా 74 వైసీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. ఈ పంచాయతీల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జరగకపోగా.. నిధులనూ జగన్ ప్రభుత్వం దారి మళ్లించడం.. వలంటీర్ల వ్యవస్థతో తమ అధికారాలను నిర్వీర్యం చేయడం వంటి కారణాలతో అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా పర్వంలో ఎక్కడో తప్ప కనిపించడంలేదు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బంగారుపాళ్యం స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



బంగారుపాళ్యం, ఏప్రిల్ 18: బంగారుపాళ్యం పోలింగ్ బూత్, పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను బైండోవర్ చేసి, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు.ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సీ-విజిల్ యాప్ ద్వారా కానీ, టోల్‌ఫ్రీ నెంబరు 112కు కాల్ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఓటర్లకు మౌలిక వసతులు, భద్రత కల్పించాలని సీఐ లక్ష్మయ్యను సూచించారు.

సరితకు డాక్టరేట్



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 18: చిత్తూరుకు చెందిన డి.సరితకు ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్థానిక ఎస్పీఎస్ మహిళా డిగ్రీ కళాశాల జూవాలజీ ప్రొఫెసర్ ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో 'తేనే, నిమ్మ ద్రావకాలను పట్టు ఆకులకు కలిపి ఇవ్వడం ద్వారా పట్టుపురుగుల ఉత్పత్తిని పెంచవచ్చు' అనే అంశంపై చేపట్టిన రీసెర్చ్‌పై సరితకు డాక్టరేట్ లభించింది.

రేపు విజ్ఞానసుధలో జాబ్‌మేళా

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 18: స్థానిక విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసుకున్న అభ్యర్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలని కోరారు.

20న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 18: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు.

ఎస్వీసెట్‌లో సెలెస్టా 2కే24 సందడి



విద్యార్థులతో హీరో ఆనంద్ దేవరకొండ

పూతలపట్టు, ఏప్రిల్ 18: పూతలపట్టు మండలం ముత్తిరేవుల వద్ద వున్న ఎస్వీసెట్‌లో సినీహీరో ఆనంద్ దేవరకొండ సందడి చేశాడు. శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం రాత్రి సెలెస్టా 2కే24 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో ఆనంద్ దేవరకొండ రావడంతో విద్యార్థుల్లో జోష్ కనబడింది. ఆయన స్టేజీ పైకొచ్చి డ్యాన్స్‌తో విద్యార్థులను ఉర్రూతలూగించాడు కేరళ డ్రమ్స్, సంగీత పాటకచ్చేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ రావూరి వెంకటస్వామి, వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ లోకనాథ రెడ్డి, సెలెస్టా కన్వీనర్ రాజ్‌కుమార్, రాజారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో జిల్లా సివిల్ జడ్జి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 18: నగరంలోని మార్కెట్ చౌక్ వినాయక ఆలయాన్ని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ దంపతులు సందర్శించి స్వామివారికి పూజలు చేసారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు వి.వేలు స్వాగతం పలికి పూజలకు ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసి అబ్జర్వర్

గుడిపాల, ఏప్రిల్ 18: మండలంలోని గొల్లమడుగు, సియోన్ మలై చర్చి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను గురువారం ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ శంకర్ ప్రసాద్ శర్మ తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో గణపతి పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ రిపోర్టులు అందించాలి

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 18: విద్యా సంవత్సరం ముగింపులోపు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందించాలని విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి డీఈవోలతో వెబ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో దేవరాజుకు పలు సూచనలు చేశారు. శుక్రవారంతో సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు ముగియనున్న నేపథ్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం ఉపాధ్యాయులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సూపర్ సిక్స్‌పై అవగాహన

బంగారుపాళ్యం, ఏప్రిల్ 18:మండలంలోని తంబుగానిపల్లె పంచాయతీలో గురువారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌నాయుడు, లోకనాథం నాయుడు, గోపాల్ నాయుడు, తిరుమల నాయుడు, సుధాకర్ నాయుడు, సురేంద్రనాయుడు, అరుణ్, మోహన్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 18: గుడిపాలలో గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చీలాపల్లె సర్పంచ్ అరుణ్, టీడీపీ నేతలు శివలింగారెడ్డి, కిట్టూ , శంకర్ చౌదరి, జగదీశ్వర్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. అన్నదానం చేయడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 18: ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి పంచాయతీ కొండేపల్లికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు జగన్నాథం పొలం వద్ద గడ్డికోసే యంత్రంలో కేసింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతువేళ్ళు మిషీన్‌లో పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని వేలూరు సీఎంసీకి తరలించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పూతలపట్టు, ఏప్రిల్ 18: నామినేషన్లు వేసే ప్రతిఒక్క అభ్యర్థి ఎన్నికల నిబంధనలు పాటించాలని పూతలపట్టు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి చెన్నయ్య కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో కార్యాలయంలోపల గుంపులుగుంపులుగా రాకూడదని, ఎన్నికల కోడ్ పాటించాలని కోరారు. అనంతరం ఏఎస్పీ అరీఫుల్లాతో కలిసి ఏర్పాటు పనులను పర్యవేక్షించారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం
గురజాల ప్రతిమ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18: ఎమ్మెల్యేగా గురజాలకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ కోరారు. గురువారం నగరంలోని 42వ డివిజన్ పరిధిలోని బజారు వీధి, గాండ్ల వీధి, వన్నియర్ బ్లాక్, గుర్రప్పనాయుడు వీధి, డీఐ రోడ్డు, జెండా మాను వీధిలలో తెలుగుమహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని చెప్పారు. అందుకే ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 42వ వార్డు ఇన్చార్జ్ శివకుమార్, అధ్యక్షుడు జయకుమార్, రాణి, వరలక్ష్మి, నాగలక్ష్మి, సుధ, గిరిబాబు, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో...

టీడీపీ రాష్ట్ర మొదలియార్ సంఘం అధ్యక్షుడు త్యాగరాజన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, నేతలు కాజూరు బాలాజి, గుడిపాల బాలాజి, గోపాలకృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



విజయకేతనం చూపిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

అట్టహాసంగా భానుప్రకాష్ నామినేషన్





తండ్రి సమాధి వద్ద నామినేషన్ పత్రం ఉంచుతున్న భానుప్రకాష్, నామినేషన్ వేయడానికి వస్తున్న భానుప్రకాష్

నగరి ఏప్రిల్ 18: నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం ఆయన రామచంద్రాపురం మండలంలోని తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు సమాధి వద్ద నామినేషన్ పత్రాలు వుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కొత్తపేట అగర వినాయకస్వామి దేవాలయానికి భానుప్రకాష్ రాగా వేదపండితులు ఆశీర్వదించారు. అక్కడే నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. తరలివచ్చిన సాఫ్ట్‌వేర్లు ఆయనను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి తరలివెళ్లారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ప్రతాప్‌రాజు ప్రతిపాదించగా రాష్ట్ర టీడీపీ అధికారప్రతినిధి జీవీరెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

విజయపురం : నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. 1500 మంది తరలి వెళ్లారు.

నింద్ర : గాలి భానుప్రకాష్ నామినేషన్ కార్యక్రమానికి నింద్ర మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరికి భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరథవాసు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవినాయుడు, వెంకటేశులు నాయుడు, బాబుయాదవ్, ధనంజయలు నాయుడు, జగన్, గంగాధరంనాయుడు, గాలి రమేష్‌నాయుడు, తేజేష్, చిట్టిబాబు, పెరుమాల్ రెడ్డి, మనోజ్ యాదవ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేష,చంద్రప్రభ వాహనాలపై కోదండరాముడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 18: నగరంలోని కోదండ రామాలయంలో ఐదు రోజులుగా స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఓవీసీ, పీవీసీ జ్యూలరీస్, దొరస్వామినాయుడు, అరుణమౌళి, నాగరాజన్, సతీష్‌కుమార్‌ల ఉభయంతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై శయనింపచేసి పురవీధులో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయం ఎదుట స్వామికి వయ్యాళి సేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి వి.రామచంద్రనాయుడు, జయచంద్రనాయుడు, లక్ష్మీపతి, మిట్టా బ్రదర్స్ జి.జే, రవీంద్రనాథ్‌ల ఉభయంతో చంద్ర ప్రభ వాహన సేవ నిర్వహించారు. ఆలయ ఈవో, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామలక్ష్మణ పట్టాభిషేకం

గిరింపేట వీరాంజనేయస్వామి ఆలయంలో గత 10 రోజులుగా స్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురు వారం స్వామివారికి నవరాత్రి ఉత్సవ శాంతి నిర్వహించి అనంతరం భక్తుల శ్రీరామనామ జయజయధ్యానాల నడుమ అర్చక బృందం సీతారామలక్ష్మణ హనుమ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించి ఉత్సవాలను ముగించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ఉత్సవ నిర్వాహకులు కె. ఎన్. కుమార్ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



శేషవాహనం శయనించి కోదండరామస్వామి

మద్యం విక్రేతలు ముగ్గురు అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 18: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వెలుతురుచేను పంచాయతీ సీజేఎఫ్ఎస్ కాలనీకి చెందిన చిన్నబాబును అదుపులోకి తీసుకుని ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కీరమందకు చెందిన రామకృష్ణను బలిజపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకుని 20 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకు న్నారు. అదేవిధంగా సామచేను మిట్టకు చెందిన మలర్ మదిని అదుపులోకి తీసుకొని ఆమె వద్ద తమిళనాడు రాష్ట్రానికి చెందిన 30 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నేతల కొబ్బరి చెట్లకు మళ్ళీ నిప్పు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18: టీడీపీ నేతలకు చెందిన కొబ్బరి చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం మళ్ళీ నిప్పుపెట్టారు. నగరంలోని మురకంబట్టు అగ్రహారంలో 40వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఎంవీ రమణ, డివిజన్ అధ్యక్షుడు ఎంవీ శ్రీమన్నారాయణలకు చెందిన టెంకాయ తోపునకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన సంగతి తెలిసిందే. గురువారం కూడా గుర్తుతెలియని వ్యక్తులు మళ్ళీ నిప్పుపెట్టారు. కాగా ఇది ముమ్మాటికీ వైసీపీ నేతల పనేనని బాధితులు ఆరోపిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ కార్యకర్తలు పరిశీలించారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

విజయపురం, ఏప్రిల్ 18: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రాజు ఆధ్వర్యంలో కేవీపురం, కాళికాపురం పంచాయతీలో ఇంటిటా ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు, సభ్యులు నటరాజమొదలీయార్, నాయకులు పురుషోత్తంరెడ్డి, చిరంజీవి, రత్నం, పుత్తూరు, నగరి నాయకులు పాల్గొన్నారు.

మాతమ్మ తిరునాళ్ల

కార్వేటినగరం, ఏప్రిల్ 18: కార్వేటినగరం పరిధిలోని బండిరేవు కాలనీలో గురువా రం మాతమ్మ తిరునాళ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మాతమ్మను ఊరేగించారు.

నీటి సరఫరా ట్యాంకర్లపై జీపీఎస్ నిఘా

చిత్తూరు, ఏప్రిల్ 18: నగరపాలక సంస్థ పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకత కోసం కమిషనర్ అరుణ గట్టి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నీటి ట్యాంకర్లు, అద్దె ట్యాంకర్లు వాటికి నిర్దేశించిన మార్గాల్లో నీటి సరఫరా చేశాయా లేదా అని పర్యవేక్షించడం కోసం జీపీఎస్ నిఘాను ఏర్పాటు చేశారు. కమిషనర్ గురువారం నగరపాలక షెడ్డులో ట్యాంకర్లకు జీపీఎస్ ట్రాకర్ల బిగింపు ప్రక్రియను పరిశీలించారు.

నామినేషన్ల హడావిడితో కలెక్టరేట్ ఉద్యోగుల ఇక్కట్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18: నామినేషన్ల పర్వం ప్రారంభం కలెక్టరేట్ ఉద్యోగులను తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఇబ్బందులు కొనసాగే అవకాశాలున్నాయి. కలెక్టరేట్‌లో అటు చిత్తూరు పార్లమెంటు స్థానానికి, ఇటు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం కాగా, వివిధ శాఖలకు చెందిన 300 మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 10 గంటలనుంచే ఉద్యోగులు కలెక్టరేట్‌కు వస్తుండగా, వారిలో గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే పోలీసులు అనుమతించారు. కార్డుల్లేని వారిని అనుమతించకపోవడంతో చాలామంది ఇళ్ళకు వెనుతిరిగారు. ఎంత ప్రాధేయపడినా పోలీసులు వారిని లోపలకు వెళ్ళేందుకు అనుమతించలేదు. మెయిన్ గేటు ద్వారా కలెక్టరేట్‌కు ఇప్పటి వరకు ఉద్యోగులకు వెళ్తుండగా, పోలీసులు దానిని మూసివేసి రెండో గేట్ ద్వారా వెళ్ళేందుకు అనుమతించారు. ఇదిలా ఉండగా వంద మీటర్ల ఆంక్షలతో బ్యాంకుకు, కలెక్టరేట్‌లో వివిధ విభాగాలకు ఎలక్షన్ సెల్‌లో వివిధ అనుమతులకోసం వచ్చే వారిని సైతం పోలీసులు లోనికి అనుమతించలేదు. మీడియాను సైతం లోనికి వెళ్ళకుండా ఆంక్షలు విధించారు. కాగా కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌లో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి.

జీడీ నెల్లూరులో ఇద్దరు నామినేషన్ దాఖలు
టీడీపీ అభ్యర్థిగా రత్నవేలు గాంధీ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పద్మనాభం





నామినేషన్ వేస్తున్న రత్నవేలు గాంధీ, పద్మనాభం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 18: గంగాధరనెల్లూరు ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటిరోజు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ తెలిపారు. వారిలో టీడీపీ తరఫున చిత్తూరు నగరానికి చెందిన రత్నవేలు గాంధీ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కార్వేటినగరం మండలం సుద్దగుంటకు చెందిన ఉసురుపాటి పద్మనాభం నామినేషన్ ఫారాలు అందజేశారని చెప్పారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 18: ఉండవల్లిలో మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో గంగాధరనెల్లూరుకు చెందిన వైసీపీ నేతలు బాబునాయుడు, జయచంద్రనాయుడు గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం గ్రామానికి చెందిన సింగిల్ విండో సొసైటీ వైస్‌ఛైర్మన్, వైసీపీ నేత బాబునాయుడు(నరసింహులునాయుడు), శ్రీరంగరాజుపురం మండలం గంగమ్మగుడికి చెందిన వైసీపీనేత జయచంద్రనాయుడులకు చంద్రబాబు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పాతపాళ్యం సర్పంచ్ వెంకటేష్‌నాయుడు, గంగమ్మగుడికి చెందిన దామోదరనాయుడు, ఆరిమాకులపల్లెకు చెందిన జగదీశ్వరనాయుడు పాల్గొన్నారు.

ఆంధ్ర సరిహద్దులో మద్యంషాపుల మూసివేత

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 18: తమిళనాడులో గురువారం పోలింగ్ సందర్భంగా ఆంధ్ర సరిహద్దులోని మద్యంషాపులు మూసివేశారు. అక్కడి జిల్లా అధికారులు సూచనల మేరకు గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రంలోని ప్రభుత్వ మద్యం షాపునకు ఎక్సైజ్‌శాఖ అధికారులు బుధవారం సాయంత్రం 4గంటలకు సీలు వేశారు.

పాలసముద్రం : తమిళనాడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాలసముద్రం మండలం బలిజకండ్రిగలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని రెండ్రోజులపాటు మూసివేస్తున్నట్లు ఎస్ఐ భారతి తెలిపారు.

జగన్ కోసం బీసీలను బలిచేస్తున్నారు : టీడీపీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18: జగన్ సీఎం కావడంకోసం బీసీలను బలిచేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇటీవల విజయవాడ బస్సుయాత్రలో సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటనలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మైనర్లను ఇరికించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఈ దాడిలో ఆధారం దొరక్కుండానే హత్యాయత్నం కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. మైనర్ బాలురలను అరెస్టు చేసి పోలీసుల కస్టడీలో ఉంచి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాలల హక్కుల చట్టాన్ని ధిక్కరించడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్ , రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారు అరెస్టు

పాలసముద్రం,ఏప్రిల్18: మండలంలోని నరసింహాపురానికి చెందిన సుందరేశన్ (30) సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ భారతి తన సిబ్బందితో వెళ్ళి అరెస్టుచేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసి ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుందరేశన్‌ను రిమాండ్‌కు తరలించారు.